بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 26 Sept 2025 (Telugu)

## తాయిఫ్ ఘజ్వ (యుద్ధ) నేపథ్యంలో
## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 26.09.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ
نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. గత ఖుత్బాలలో హునైన్ యుద్ధ సంపదను పంచిన ప్రస్తావన జరుగుతుండెను. దీని గురించి మరిన్ని వివరాలు ఇట్లు గలవు. ఇంతకు ముందు ప్రస్తావించబడినట్లు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధ సంపదను పంచిపెట్టినప్పుడు యుద్ధ వీరులకు వారి, వారి భాగాలు కూడ అందించిరి. కానీ వారు స.అ.స. ఐదవ భాగాన్ని దాదాపు మొత్తం ఖురైష్ నాయకులు, అరబ్ నాయకులకు పంచి పెట్టిరి.  ఒకరికి వంద ఒంటెలు, మరొకిరికి యాభై ఒంటెలు పంచిపెట్టిరి. ఇంత ఎక్కువగా ధనాన్ని ఇతరులకు అందించినప్పుడు కొందరు అన్సార్ నవయువకులు తమ సేవలు, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో గల అభిమానం వలన తమను తాము ఇతరుల కంటే అధిక అర్హులుగా భావించసాగిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక్కోసారి నిర్లక్ష్యంగా మాట్లాడిన మాటలు చాలా సుదీర్ఘ ఫలితాలకు కారణమైతాయి. సారాంశమేమనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పంచుట గురించి కొందరు అన్సార్ నవయువకులు అయిష్టతను వ్యక్తపరచిరి. కానీ అందరు అలా మాట్లాడలేదు. అయినను దేవుణ్ణి, దేవుని ప్రవక్త స.అ.స.ను ఇవి ఎంతగా అసంతృప్తికి గురి చేశాయనగా సుదీర్ఘ కాలం వరకు దీని దుష్పరిణామాలను అన్సార్ అనుభవించవలసి వచ్చెను. ఈ విషయాన్ని ప్రస్తావిస్తు హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్‌హు ఇట్లు ఉపదేశించిరి. పవిత్ర ప్రవక్త స.అ.స. మక్కాను జయించినప్పుడు మక్కా ప్రజలు వారి స.అ.స. వద్దకు చేరుకొనిరి. ఇంకా పూర్తి విశ్వాసంతో నిండని వీరి చూపులు ఇంకా ప్రాపంచికం వైపే ఉండెను. దీని తర్వాతి ఒక యుద్ధంలో కొంత సంపద ముస్లింలకు లభించెను. అటువంటి సంపదను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆయా ప్రజలలో పంచి పెట్టిరి. ఒక అన్సార్ నవయువకుడు ఏదో ఒక సమూహంలో ఇట్లనెను. మా ఖడ్గాలతో రక్తం కారుతుంది, కానీ పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సంపదను తమ బంధువులకు పంచారు.

ఈ విషయం వారి స.అ.స.కు తెలియగానే అన్సార్ గొప్ప అనుచరులను పిలిపించి నాకీ విషయం తెలిసిందని అడిగిరి. అన్సార్ రోధిస్తూ ఇట్లనిరి. ఇదేదో ఒక అమాయకుడు అన్నాడు. వారు స.అ.స. ఇట్లనిరి. లేదు! అన్సార్! మీరిట్లు చెప్పవచ్చును. ఎవరు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు

ఆశ్రయం కల్పించనప్పుడు, అతణ్ణి అతని నగరవాసులు బహిష్కరించినప్పుడు మేము అతనికి ఆశ్రయం ఇచ్చామని మీరు చెప్పవచ్చును. అనంతరం అతనికి గౌరవం, విజయం లభించినప్పుడు అతను ధనాన్ని తమ బంధువులకు పంచిపెట్టెను. అప్పుడు అన్సార్ గట్టిగా ఏడ్చినారు. అనంతరం వారిట్లు వేడుకొనిరి. ఓ దైవ ప్రవక్త స.అ.స.! మేమిలా మాట్లాడలేదు. తర్వాత వారు స.అ.స. ఇట్లనిరి. మీరు ఇదే విషయాన్ని మరో రకంగా కూడా చెప్పవచ్చును. అదెట్లనగా దేవుడు యావత్ ప్రపంచ సన్మార్గం కొరకు పంపిన వ్యక్తి మక్కాకు చెందినవారు. కానీ దేవుడు అతన్ణి మదీనాకు తీసుకొచ్చెను. అనంతరం దేవుడు తన శక్తి, వైభవంతో అతని కొరకు మక్కాను జయింపజేసెను. అప్పుడు తమ వస్తువు (ప్రవక్త) తమకు లభిస్తుందని మక్కావారు ఊహించుకొనిరి. అప్పుడు మక్కా వారు మేకలు, గొర్రెలను తీసుకొని తిరిగి వెళ్లారు. కానీ మదీనా ప్రజలు దేవుని ప్రవక్త స.అ.స.ను తమ వెంట తమ నగారికి తీసుకెళ్లారు. ఈ విషయం నిశ్చయంగా ఒక అమాయకుని నోట వెలువడినది. కాని దీని వలన ఇక ముందు మీకు ప్రాపంచిక ప్రభుత్వం, నాయకత్వం లభించదు. ఇక మీ సేవల ప్రతిఫలం ప్రళయదినాన కౌసర్ సరస్సు వద్ద (అనగా స్వర్గం)లో లభించును. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇట్లనిరి. చూడండి! పదమూడు శతాబ్దాలు గడిచినవి, పదునాలుగవ శతాబ్దం నడుస్తున్నది. (ఇప్పుడైతే అది కూడా గడిచిపోయింది. ఈ కాలంలో ప్రతి జాతి ఇస్లాం కారణంగా రాజరికాన్ని పొందింది. కానీ ఏ ఒక్క అన్సార్ వ్యక్తి రాజు కాలేకపోయనెను. ఒక వ్యక్తి వ్యాఖ్యం మొత్తం జాతికి నష్టాన్ని కలిగిస్తుంది.

ఈ సంఘటనను హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) తమ ఒక ఖుత్బాలో ప్రస్తావించిన తర్వాత జమాఅత్‌నకు ఇట్లు ఉపదేశించారు. అప్పుడు ముఖ్యమైనట్లే అది నేడు కూడా మనకు వర్తిస్తుంది. వారు (రజి) ఇట్లనిరి. తమకు ఏదేని పదవి లేదా సంపద మొదలగు లభించాలని త్యాగం చేస్తున్నవారు నేను పిలిచినప్పుడు (అనగా వర్తమాన ఖలీఫా పిలిచినప్పుడు) త్యాగం కొరకు రాకండి. దేవుని కొరకు త్యాగం చేయదలచిన ప్రజలే రండి. ఎందుకనగా స్వయంగా నేను బలహీనమైన, వ్యాధులతో కూడిన వ్యక్తిని. నేనెవరి ఉపకారాన్ని మోయలేను. నేను నా కొరకు అడగను. దేవుని కొరకు ఇవ్వదలచిన వారు ఇవ్వవలెను, దేవుడు అతనికి ప్రతిఫలమిచ్చును. దేవుణ్ణి నమ్ముకోవలెను. అతడు కోరినచో ఇహలోకంలో ఇచ్చును లేదా అతడు కోరినచో పరలోకంలో ఇచ్చును. మొత్తమ్మీద వినయంతో త్యాగం చేసిన వారి త్యాగం వృథా కాదు. విశ్వాసుని త్యాగం ఎన్నడు వృథా కాదు. ప్రాపంచికం కొరకు కాక దేవుని కొరకు త్యాగం చేయువారే నిజమైన త్యాగధనులు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక వయసుకు చేరుకున్న తర్వాత జమాఅత్ సభ్యులలో కూడ ఇటువంటి భావం కలుగుతుంది. మాకు ఇంత అనుభవమున్నది, మేము ఇంత పని చేశాం, మాకు ఇలాంటి రివార్డ్ (బహుమతి) లభించవవలెను. అది లభించదు. కేవలం ప్రాపంచిక బహుమతి తీసుకుంటారా లేక అల్లాహ్ తఆలా బహుమానాలకు వారసులు కావాలను కుంటున్నారా? అన్సారుల్లాహ్ ఇజ్తిమా కూడా నేడి నుండి మొదలవుతుంది. అనుభవం కలిగిన తర్వాత ఈ వయసులో ఇటువంటి భావం కలుగుతుంది. అన్సార్‌లో కూడా ఎవరి మనసులోనైనా తన అనుభవం, సేవ వలన ఇటువంటి భావం కలిగినచో దానిని వెంటనే తొలగించుకోవలెను. అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందుటకు ప్రయత్నించవలెను.

ఈ సందర్భంన గ్రామీణ ప్రజల అసహన ప్రస్తావన కూడా లభిస్తుంది. యుద్ధ సంపదను పంచుతున్నప్పుడు కొందరు గ్రామీణులు కూడ వారి స.అ.స. చుట్టు గుమికూడి, ధనాన్ని అడుగతుండిరి. గ్రామీణులు చూపిన ఈ అనాగరిక ప్రవర్తన వలన ఎవరిని శిక్షించలేదు, ఆగ్రహం చూపకుండా నవ్వుతు ఉత్తమ రీతిలో వారికి శిక్షణ అందిస్తు వారికి ధనం కూడా ప్రసాదించిరి.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇట్లనిరి. ఈ యుద్ధాలను ముగించుకున్న తర్వాత పరాజిత శత్రువుల పరిహారాలు, రణ రంగంలో వదిలిపెట్టిన వస్తువులను గత ఆచారం మేరకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లామీ సైన్యంలో పంచి పెట్టవలసిన అవసరముండెను. కానీ ఈ సందర్భంన వారు స.అ.స. ముస్లింలలో ఈ ధనాన్ని పంచి పెట్టేబదులు మక్కా చుట్టు ప్రక్కల ప్రజలలో పంచి పెట్టిరి. ఈ ప్రజలలో ఇంకా విశ్వాసం ఏర్పడలేదు, ఇంకా చాలా మంది అవిశ్వాసులుగానే ఉండిరి, ఇస్లాంలో చేరిన వారు కూడా ఇంకా క్రొత్త క్రొత్త ముస్లింలుగానే ఉండిరి. ఒక జాతి తన సంపదను ఇతర జాతులలో పంచి పెట్టు ఈ విషయం వారి కొరకు పూర్తిగా క్రొత్త విషయంగానే ఉండెను. ఈ ధనాన్ని పంచుటలో సత్కార్యం, నిష్టాపరత ఏర్పడే బదులు ఇంకా దురాశ పెరిగింది. వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు గుమికూడిరి. ఇంకా కావాలని ఆడుగుతు వారి స.అ.స.ను ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టిరి. ఇలా వారిని నెట్టుకొంటూ ఒక చెట్టు దగ్గరికి తీసుకెళ్లిరి. ఒక వ్యక్తి అయితే వారి భుజాల మీద ఉన్న చద్దరును పట్టుకొని లాగడంలో వారు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడిరి. వారు స.అ.స. ఇట్లనిరి. ఓ ప్రజలారా? నా వద్ద ఇంకా ఏమైనా ఉన్నచో దానిని కూడా నేను మీకే ఇచ్చేవాడిని. మీరెన్నడు నన్ను లోభికునిగా లేదా పిరికివానిగా పొందలేరు.

అనంతరం వారు స.అ.స. తమ ఒంటె వద్దకు వెళ్లి, దాని ఒక వెంట్రుకను తెంపి పైకి లేపి చూపుతు ఇట్లనిరి. ఓ ప్రజలారా! అరబ్ చట్టం ప్రకారం ప్రభుత్వ ఐదవ భాగం తప్ప మీ ధనంలోని నాకు ఈ వెంట్రుక సమానంగా కూడ ఏమియును అవసరం లేదు. ఆ ఐదవ భాగాన్ని కూడా నేను నా కొరకు ఖర్చుపెట్టుకోను, అది కూడా మలోని ప్రజలలోనే ఖర్చు చేయబడుతుంది. అవినీతికి పాల్పడే వ్యక్తి ప్రళయ దినాన ఈ అవినీతి వలన అవమానానికి గురగును. హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రాజరికాన్ని ఆశించిరని ప్రజలు అంటుంటారు. రాజులు మరియు పౌరుల మధ్య ఇలాంటి సంబంధం ఉంటుందా, రాజును ఇలా నెట్టుకొంటూ పోయే లేదా అతని మెడలో వస్త్రం వేసి శ్వాస ఆడని రీతిలో లాగే శక్తి ఎవరికైనా ఉంటుందా? దైవ ప్రవక్తలు తప్ప ఇలాంటి ఆదర్శాన్ని ఎవరు చూపగలరు! మొత్తం ధనాన్ని ఈ విధంగా పంచిపెట్టినా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పంచుటను న్యాయమైన పద్ధతిలో జరగలేదని విమర్శించిన కఠిన మనస్కులు ఉండిరి.

హదీస్‌లో కథనాలు ఇట్లు లభిస్తాయి. యుద్ధ సంపదను పంచిపెడుతున్నప్పుడు ఒక గ్రామీణ వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనెను. ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో చేసిన వాగ్దానాన్ని పూర్తి చెయ్యుము. దైవ ప్రవక్త స.అ.స. ఇట్లనిరి. ఆనంద పడండి. ఆ గ్రామీణుడు ఇట్లనెను. ఆనందపడుమని మీరు చాలా సార్లు అన్నారు. కాని మీరు స.అ.స. ఇచ్చింది ఏమియును లేదు. కేవలం అంటుంటారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అతని ఈ మాట చాలా అసంతృప్తికి గురి చేసెను. వారు స.అ.స. తమ ముఖాన్ని వేరే వైపు త్రిప్పుకొనిరి. అటువైపు

అబూమూసా అల్అష్అరీ (రజి) మరియు బిలాల్ (రజి) నిలబడి ఉండిరి. వారి వైపు ముఖాన్ని త్రిప్పుకొంటూ ఇట్లనిరి. ఇతడు శుభవార్తను స్వీకరించడానికి నిరాకరించెను, ఇప్పుడు మీరు స్వీకరించండి. వారిద్దరు తక్షణమే ఇట్లనిరి. ఓ దైవ ప్రవక్త! స.అ.స. మేము స్వీకరించాం. అనంతరం వారు స.అ.స. నీటి చెంబును తెప్పించుకొని, దానితో తమ చేతులు, ముఖం కడుక్కున్నారు. తర్వాత మిగిలిన ఆ నీటిని హజ్రత్ అబూమూసా (రజి) మరియు బిలాల్ (రజి) నకు అందిస్తూ ఇట్లనిరి. మీరిద్దరు ఈ నీటిని త్రాగి, తమ ముఖాలు, యదలపై చల్లుకోండి, ఆనందించండి. కావున వారు ఈ నీటి చెంబును తీసుకొని అలాగే చేశారు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. పవిత్ర సతీమణుల వినయం, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో శుభాలను పొందు దాహం గురించి విచిత్ర, అసూయపడదగిన ఒక దృశ్యం కనిపిస్తుంది. ఇట్లు వ్రాయబడెను. సమీపంలోని ఒక గుడారంలో విశ్వాసుల తల్లి హజ్రత్ ఉమ్మె సల్మ రజియల్లాహు అన్హా కూడ ఉండిరి. తెర వెనుక నుండి ఆమె ఇట్లనిరి. తమ తల్లి కొరకు కూడా నీటిని మిగలనివ్వండి. కావున వారు హజ్రత్ ఉమ్మె సల్మ (రజి) కొరకు కూడా చెంబులో కొన్ని నీటిని మిగిల్చి అందించారు.

ముగింపులో హుజూరె అన్వర్ ఇద్దరు మృతుల సద్గుణాలను ప్రస్తావించారు.

(1) గౌ॥ ఫహీముద్దీన్ నాసిర్ గారు ముబల్లిఘ్ సిల్సిల రూమానియా. వీరి వంశంలో అహ్మదియ్యత్ వీరి ముత్తాత హజ్రత్ మిర్జా ఇల్మ్ దీన్ (రజి) గారి ద్వారా ప్రవేశించినది. మృతులు కీ॥ శ॥ 1996 సం॥లో జామిఅ నుండి ఉత్తీర్ణులైనారు. అనంతరం వారు పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణలో ప్రత్యేకంగా శిక్షణ పొందారు. కీ॥ శ॥ 2006వ సం॥లో వీరిని రూమానియా పంపబడెను. మృతి చెందే వరకు అక్కడే సేవలందించు అనుగ్రహం పొందారు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. వీరు విదేశాలలో ధర్మం కొరకు త్యాగమిచ్చారు. ఈ విధంగా వీరు అమరుల స్థాయిని పొందారు. చివరి శ్వాస వరకు ప్రతిజ్ఞను ఎంతో గొప్పగా పాంటించారు. ఇంకా ఇట్లనిరి. కీ॥ శే॥ ఫహీమ్ నాసిర్ గారి జీవితంలో జీవిత సమర్పితుల కొరకు ప్రత్యేక ఆదర్శం మరియు ఒక గుణపాఠం గలదు.

(2) గౌ॥ అబ్దుల్ అలీమ్ ఫారూఖీ గారు తండ్రి అబ్దుర్రషీద్ ఫారూఖీ గారు కెనడా నివాసులు. వీరిని వీరి స్వగృహంలోనే సాయుధ దొంగలు కాల్చి చంపారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. వీరు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అనుచరులైన హజ్రత్ మౌల్వీ ఖుద్రతుల్లాహ్ సన్నోరి (రజి) గారి మరియు హజ్రత్ మౌల్వీ ముహమ్మద్ హుసేన్ (రజి) గారి (నవాసా) మునిమనుమలు.

మృతుల క్షమాబిక్ష, స్థాయి అంతస్తుల పెరుగుదల కొరకు హుజూరె అన్వర్ దుఆ చేసి, వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి.

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَ مِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔